క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో 33/11 కేవీ విద్యుత్ వైర్ల మరమ్మత్తులు నిమిత్తం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాడేరు రోడ్, వైఎస్సార్ కాలనీ, బ్రిడ్జిపేట,గునుపూడి, గరువు పేట, ఎంప్లాయిస్ కాలనీ, నల్లం వారి వీధి, శివాలయం సెంటర్, సోమగుండం చెరువు ఏరియా, నాచువారి సెంటర్, బేతనీపేట, చిన అప్పారావు తోట, బ్యాంకు కాలనీ, రెడ్డి కాలనీ, సుంకర పద్దయ్య గారి వీధి, రెస్ట్ హౌస్ రోడ్, కేజీఆర్ కళాశాల ఏరియా, గంగానమ్మ గుడి సెంటర్, యనమదుర్రు, దిరుసుమర్రు, కట్టావారిపాలెం, తాడేరు, యమునాపల్లి, కొర్రపాడు, బేతపూడి, కరుకువాడ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

సాక్షి, భీమవరం: భీమవరంలో ఈనెల 23, 24 తేదీల్లో రెండు రోజులపాటు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గసమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ చెప్పారు. గురువారం భీమవరంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. సమావేశాల్లో కేంద్ర మంత్రులు, పార్టీ ముఖ్య నాయకులతో పాటు 400 మంది ఆహ్వానితులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి గరికపాటి ప్రవచనాలు



వివరాలు వెల్లడిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు

భీమవరం(ప్రకాశం చౌక్): ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆనంద ఫంక్షన్ హాల్లో ఈ నెల 20, 21 ,22వ తేదీల్లో ఉపనిషత్తులపై పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనాలు చెబుతారని ఆనంద ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తెలిపారు. గురువారం క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజుతో కలిపి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై ఎస్పీ విచారణ

పోడూరు: గుమ్మలూరులో తాళం వేసి ఉన్న ఇంట్లో ఇటీవల భారీ చోరీ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ యండమూరి వెంకట్రావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. దాదాపు 118 కాసుల బంగారు ఆభరణాలు, సుమారుగా రూ.7 లక్షల నగదు చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై వై.నాగలక్ష్మి కేసు నమోదు చేశారు. చోరీ ఘటనపై గురువారం జిల్లా ఎస్పీ రవిప్రకాష్, నరసాపురం డీఎస్పీ మనోహరాచారి గురువారం గ్రామానికి వచ్చి విచారణ చేశారు. వారి వెంట సీఐ కె.శ్రీనివాస్‌కుమార్ ఉన్నారు.

22న చాంబర్స్ కళాశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ పర్యవేక్షణలో కేవీఎం చాంబర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు గురువారం కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఈ టెస్ట్ నిర్వహించనున్నామన్నారు. ఈ మెరిట్ టెస్ట్ వల్ల విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందన్నారు. ఈ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 20, రూ, 15, రూ. 10 వేలు బహుమతులుగా ఫీజుల్లో రాయితీ కల్పిస్తామని పేర్కొన్నారు.

ఏపుగా పెరిగేను... వెదజల్లిన చేను

ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందంటున్న రైతులు



దొడ్డనపుడిలో ఏపుగా పెరిగిన వెదజల్లిన చేను

కాళ్ల: వెదజల్లిన చేలు ఏపుగా ఎదిగడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాళ్వా సాగులో వెదజల్లేందుకే రైతులు మక్కువ చూపుతున్నారు. వెదజల్లడం వల్ల కూలీల రేటు కలిసి వస్తుందని, మాసూళ్లు కూడా ముందుగా వస్తాయని, దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నారుమళ్లు, నాట్లు వేసేందుకు కూలీల డబ్బులు కలిసి వస్తాయని, నారుమళ్లు వేసేందుకు ఎకరాకు 20 నుంచి 30 కిలోల వరకు విత్తనాలు జల్లుతున్నరని రైతులు అంటున్నారు. అదే వెదజల్లడానికైతే 8 నుంచి 15 కిలోలు సరిపోతాయని అధికారులు, రైతులు చెబుతున్నారు. దీనివల్ల సుమారు 10 కిలోల విత్తనాలు కలిసి వస్తాయని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎరువులు, పురుగు మందులు అవసరం కూడా బాగా తగ్గుతుందంటున్నారు.

ముందుగానే ముగింపు

వెదజల్లు సాగు వల్ల నీటి వాడకం కూడా తగ్గించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. దాళ్వా సాగులో సాధారణంగా సాగునీరు అందటం కష్టతరమవుతుంది. ఈ పరిస్థితుల్లో వెదజల్లడం వల్ల సాగునీరు ఇబ్బంది నుంచి కూడా గట్టెక్కవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మసూళ్లుకూడా సుమారు 20 రోజుల ముందు పూర్తి చేసుకోవచ్చని చెబుతున్నారు. దిగుబడి కూడా ఎకరాకు సుమారు 45 నుంచి 50 బస్తాలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతేకాకుండా వెదజల్లడం వల్ల ఎకరాకు సుమారు రూ.10 వేల వరకు ఆదా అవుతుందని చెబుతున్నారు. మండలంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ఎక్కువమంది రైతులు 1121 (అమ్మోరు) రకంతో పాటు 1153 రకం వరి వంగడాన్ని దాళ్వాకు సాగు చేస్తున్నారు. కూలి రేట్లు పెరిగి కూలీలు దొరకని పరిస్థితి ఉన్న ఈ రోజుల్లో వెదజల్లేందుకే ఆసక్తి చూపుతున్నట్లు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికే మండలంలో కాళ్ల, దొడ్డనపూడి గ్రామాల్లో వెదజల్లగా మిగిలిన ప్రాంతాల్లో కూడా వెదజల్లే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా దాళ్వా సాగులో సాగునీటి కష్టాలు ప్రకృతి వైపరీత్యాలు నుంచి దాటాలంటే వెదజల్లే ప్రక్రియలో సాగు చేయడమే మంచిదని రైతులు అంటున్నారు. డివిజన్ స్థాయిలో సుమారు రెండువేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే అధికారుల లెక్కల ప్రకారం ఆకివీడు మండలంలో 1600 ఎకరాలు, కాళ్ల మండలంలో 200 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నట్లు తెలుస్తుంది.

రైతులు ఆసక్తి చూపాలి

దాళ్వా సాగులో వెదజల్లే సాగుకు రైతులు ఆసక్తి చూపాలి. దీనివల్ల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. వెదజల్లడం వల్ల ముందుగానే పంట చేతికి వస్తుంది. రూ.5 వేల నుంచి నుంచి పది వేల వరకు రైతులకు కలిసొస్తుంది. వెదజల్లిన 15 రోజుల్లోపు చాతి, నామిని గోల్డ్ వంటి కలుపు మందులు రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.

– జయ వాసుకి, ఏఓ, కాళ్ల

బాబా ఆలయాల్లో భక్తుల రద్దీ

కాళ్ల: మండలంలోని పెదఅమిరం, సీసలి, దొడ్డనపూడి, కాళ్ల గ్రామాల్లోని సాయిబాబా ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. సీసలి గ్రామంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉండి మండల వైఎస్సార్సీ కన్వీనర్ రామకృష్ణ ఆంజనేయరాజు, శ్యామలాదేవి దంపతుల ఆర్థిక సహకారంతో సాయిబాబా ఆలయంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పేదలకు అన్నదానం

భీమవరం(ప్రకాశం చౌక్): పేదలకు అన్నదానం కార్యక్రమం శ్రీ వెంకటరామ థియేటర్ ప్రాంగణంలో , గన్నాబత్తుల వారి కుటుంబ ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇటీవల జరిగిన సంక్రాంతి వేడుకలలో దేశ విదేశాలలో ఉన్నటువంటి గన్నాబత్తుల కుటుంబ సభ్యులు , ఒక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని నిర్వహించారని , వికలాంగులకు పేదలకు 150 మందికి భోజనం, కంచం, గ్లాసు సంపూర్ణంగా అందించారని తెలిపారు. కార్యక్రమంలో గన్నాబత్తుల వారి కుటుంబీకులు గన్నాబత్తుల సత్యనారాయణరావు, గన్నాబత్తుల శ్రీనివాస్ , గన్నాబత్తుల పద్మారావు , గన్నాబత్తుల ఫణి కుమార్, నరహరిశెట్టి కృష్ణ ,నీలాతి పోతయ్య, వడుపు గోపి తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



భీమవరంలో గృహనిర్మాణాలపై డీఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



అంగన్‌వాడీ సిబ్బందికి నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేసే విధంగా గృహ నిర్మాణశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ డీఈ బి.వెంకటరమణతో నియోజకవర్గంలో జరుగుతున్న గృహ నిర్మాణాలపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో సుమారుగా 14 వేల మందికి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు చెప్పారు. గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు మంజూరు చేయడమేగాక లబ్ధిదారుల అవసరాన్ని బట్టి రూ. 30 వేలు బ్యాంకు రుణం అందిస్తున్నట్లు చెప్పారు. పేదలు సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యంగా ఇళ్లస్థలాలు మంజూరుచేసి ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలో మొదటి విడతగా 6,324 ఇళ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఒకే చోట పెద్ద సంఖ్యలో ఇళ్లు నిర్మించి జగనన్న కాలనీలుగా రూపుదిద్దుకుంటునందున కాలనీలకు ప్రభుత్వం అన్ని రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జగనన్న కాలనీలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను ఇప్పటికే కలిప్పించినట్లు శ్రీనివాస్ చెప్పారు. కాలనీల్లో అంతర్గత రోడ్లను నిర్మిస్తామని కాలనీలన్నీ ఒక ఊరు మాదిరిగా తయారవుతాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే శ్రీనివాస్ స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ వర్కర్లు ఉత్తమ సేవలు అందించాలి

సాక్షి, భీమవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో నూతనంగా నియమితులైన 13 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు గురువారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్ నియామక పత్రాలను అందించిన సందర్భంగా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమేగాక పౌష్టికాహారం అందించడంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాలు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ విజయరత్నం, కె.సరళ, రజని, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం హామీలను అమలు చేయాలి



భీమవరంలో రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని కోరుతూ ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, ఏప్రిల్ 5న ఢిల్లీలో ప్రదర్శన నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య చెప్పారు. భీమవరం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నర్సింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉందని కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సుమారు లక్షమంది రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ బాబురావు, చీర్ల పుల్లారెడ్డి, తాళ్లూరి రాము, గుత్తుల శ్రీను, చింతపల్లి లక్ష్మి, బాలం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైళ్లమ్మ జాతర



చిలుకూరు పైళ్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

ఉండి: మండలంలోని చిలుకూరు గ్రామంలో ఉన్న పైళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు, టీటీడీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోకరాజు రామరాజు, సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనా కార్యక్రమం సందర్భంగా అమ్మవారికి నిర్వహకులు, ఆలయ కమిటీ నైవేద్యాలు పెట్టి పూజలు నిర్వహించిన సందర్భంగా నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అన్న సమారాధనను పీవీఎల్, సర్రాజు, రామరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రణస్తుల కనకదుర్గ, మహంకాళి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చేకూరి శ్రీనివాసరాజు (బోసురాజు), ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మంతెన వెంకటనర్సింహరాజు, రుద్రరాజు బలరామరాజు, వేగేశ్న దిలీప్ రాజు, పెన్మత్స భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

జింక్ లోపానికి, అగ్గి తెగులుకు తేడా తెలుసుకోవాలి

యలమంచిలి: మండలంలోని పలు గ్రామాలలో దాళ్వా పంటలో జింక్ ధాతు లోపం కనిపిస్తుందని, దీనినే కొంతమంది రైతులు అగ్గితెగులుగా భావించి అగ్గితెగులు నివారణ మందులు పిచికారి చేస్తున్నారని, ఆ విధంగా చేయవద్దని నరసాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఈద అనిలకుమారి కోరారు. యలమంచిలి, చించినాడ గ్రామాలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జింక్ లోపం వచ్చిన వరి కంకి పై నుంచి మూడు లేదా నాలుగు ఆకుల మధ్యలో ఈనె పాలిపోతుందన్నారు. నాట్లు పూర్తయిన రెండు నుంచి నాలుగు వారాలలో ముదురు ఆకు చివరలో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు కనపడతాయన్నారు. ఆకులు చిన్నవిగా పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయన్నారు. మొక్కలు సరిగా దుబ్బు చేయవన్నారు. ఈ లోపం కనిపించగానే కొంతమంది రైతులు అగ్గితెగులుగా భావించి నివారణ మందులు పిచికారి చేస్తున్నారన్నారు. కానీ ఈ లక్షణాలను జింక్ ధాతు లోపంగా భావించి నివారణకు లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి వారం వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, అగ్రికల్చరల్ అసిస్టెంట్స్ స్వప్న, నవ్య పాల్గొన్నారు.

ప్రతీ రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

మొగల్తూరు: ప్రతి రైతు తాము పండించిన పంటను ఈక్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏడీఏ అనిల్ కుమారి సూచించారు. గురువారం రామన్నపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడారు. రైతులు తమ పంటను ఈక్రాప్‌లో నమోదు చేయించుకుంటే కేంద్ర,రాష్ట్ర పభుత్వాలు అందిస్తున పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ఆమె వెంట ఏఓ ఎం.సుజాత ఉన్నారు.

పేదల సంక్షేమానికి భరోసా



దుంపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: పేదల సంక్షేమానికి భరోసానిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో రెండో రోజు గురువారం పీవీఎల్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో డ్రెయినేజీ సమస్య, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని పలువురు పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ బోర్డుదేనన్నారు. అయినప్పటికీ డ్రెయినేజీ, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టి మౌళిక సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతీ పేదవాడు ఆర్థికంగా ఎదగాలనే ఆశయంతో సీఎం జగన్ సంక్షేమ పథకాల్ని అమలుజేస్తున్నారని చెప్పారు.అన్ని వర్గాల పేద ప్రజలకూ సంక్షేమం పథకాలు అందజేస్తామని చెప్పారు. వృద్ధులకు రూ. 2,750ల ఫించన్ పథకం పారదర్శకంగా అమలుజేస్తున్నామని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థ నిస్వార్థంగా పనిచేస్తుందని చెప్పారు. పేదల సంక్షేమం ప్రతిపక్షానికి గిట్టడంలేదన్నారు. పేదల ఎదుగుదలను ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలుజేస్తున్న పథకాలు, అభివృద్ధి, సంక్షేమాన్ని అనుసరిస్తుంటే, ఇక్కడ ప్రతిపక్షాలు అధికార దాహంతో విమర్శలకు దిగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి, నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, జి.ధనరాజు, అంబటి రమేష్, మోరా జ్యోతి, ఎండీ.మదనీ, జక్కీ, ఆలీ, జహాంగీర్, ఎంపీటీసీ సభ్యులు పిన్నమరాజు సూర్యనారాయణరాజు, సాగ్రా నాగబాబు, వైసీపీ నాయకులు కొట్టు మాణిక్యాలరావు, అట్లూరి సంజయ్, కవిటం సుబ్రహ్మణ్యం, కొయ అయ్యన్న, కిరణ్, మద్దా సుధాకర్, దాసరి వెంకటేష్, అంజిబాబు, చేబోయిన సత్యవతి, దేవస్థానం చైర్మన్ రామిశెట్టి సూరిబాబు, కౌన్సిలర్లు కట్టా రవి, మోటుపల్లి కుమారి, గుండుగొలను సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సీఎం జగన్‌తోనే భరోసా



ఉండిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ.

ఉండి: కల్లుగీత కార్మికుల జీవితాలకు భరోసా కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో కల్లుగీత కార్మికులంతా జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ అన్నారు. కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రూ.10 లక్షలు గీతకార్మిక భరోసా పేరుతో అందిస్తున్నట్లు, సహజ మరణానికి రూ.5 లక్షలు బీమా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 21 విడుదల చేయడంపై ఉండిలో గురువారం పలువురు కల్లుగీత కార్మికులతో బాలాజీ సమావేశమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కులాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారన్నారు. గీత కార్మిక కులాలైన గౌడ,శెట్టిబలిజ, శ్రీశైవ, యాత,ఈడిగ కులాల వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీ పీ నాయకులు వీరమల్లు మల్లేశ్వరరావు, జోగి దుర్గారావు, అంగర సునీల్, వీరమల్లు మహేష్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

పాలకోడేరు: ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న సైక్లిస్టును ఢీ కొనడంతో అతను గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే గురువారం అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసి బస్సు శృంగవృక్షం హైస్కూల్ వద్ద అదే గ్రామానికి చెందిన నందం అప్పారావు(62) సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. బాధితుడు ప్రస్తుతం భీమవరం ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నాడు. అప్పారావు కుమారుడు సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకోడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వేమన జయంతి



వేమన పద్యం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వీరవాసరం: వేమన జయంతి పురస్కరించుకొని స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.ప్రభా మంజరి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతంలోని మూఢనమ్మకాలను ఎత్తిచూపి నిజాన్ని మన ముందు ప్రతిబింబించిన సామాజిక విప్లవకారుడు యోగి వేమన అన్నారు. అనంతరం విద్యార్థులకు వేమన పద్యాల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో పంపన సాయిబాబు, కె.ఆనందరావు ,వై.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, వై.హేమలత, నరసింహారావు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో గురువారం ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సత్యదేవ అన్నమాచార్య బృందంతో అన్నమాచార్య కీర్తనలు, సాయంత్రం 5 గంటలకు పి.లక్ష్మీ లీలా భగవతారిణితో 'హరికథ', సాయంత్రం 6 గంటలకు గొర్రెల రాము అండ్ పార్టీతో 'బుర్రకథ', రాత్రి 8 గంటలకు ఆకాశ ఆర్కెస్ట్రా వారితో 'సినీ సంగీత విభావరి' కార్యక్రమాలు అలరించాయి.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు:

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కుసుమ హరినాథ భక్త బృందం ఆకివీడు వారితో భజన, ముదపాక బాల సుందరం భాగవతార్ తాడేపల్లిగూడెం వారితో హరికథ, సాయంత్రం 6 గంటలకు శ్రీ శ్రీనివాస ఆర్కెస్ట్రా రాజమండ్రి వారితో సినీ మ్యూజికల్ నైట్, జై నాట్య మండలి గుడివాడ వారితో శ్రీవల్లి కల్యాణం నాటకం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ ఆఫీస్‌లో తనిఖీలు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ పి.శివరామకృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ వాహనాల ఆయిల్స్, కోవిడ్ నిధులను దుర్వినియోగం జరిగిందని అందిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు రికార్డులు పరిశీలించామని తెలిపారు. తనిఖీ వివరాలను ఉన్నత అధికారులకు అందజేస్తామని ఆయన వివరించారు.

22న శ్రీశైలం కర్ణభక్త సత్రం కమిటీ మహాజన సభ

పాలకొల్లు సెంట్రల్: శ్రీ కర్ణభక్త సమాజ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశైలం సత్రం కమిటీ మహాజన సభ నిర్వహించనున్నట్లు సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి శాగా రాంబాబు గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పాలకొల్లు పట్టణంలోని అద్దేపల్లి వారి సత్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సత్రంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు, నూతన కమిటీలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సత్రం గౌరవ అధ్యక్షులు శలా కోటి వీరయ్య, అధ్యక్షులు పొన్నా మల్లిఖార్జునరావులు పాల్గొంటారన్నారు.